నికి విలువ యివ్వకపోతే వాళ్ళ పుట్టింటిపైన అలిగినట్టు నాపైనా అలుగుతుంది! అవునా హేమా?" అన్నాడు.

లక్ష్మికి ఏమీ అర్థం కాలేదు కానీ హేమకు మాత్రం నోట మాట రాలేదు. అవునన్నట్టుగా తలవూపింది వెర్రిగా.

పండుగయిపోయిన మూడు రోజుల తరువాత ఒక రోజు రాత్రి హేమ రవితో అంది "ఏమండీ! నేను అలిగి వచ్చేశానని మా అన్నయ్య బాధపడుతూ వుంటాడు. రేపు ఓసారి వెళ్ళి నాలుగు రోజులుండి వస్తాను"

"దట్సగుడ్" అన్నాడు రవి భార్యవైపు తృప్తిగా చూసి.

-కె.యస్.ఇందిరా ప్రియదర్శిని (చెన్నై)

# ఇది తప్పంటారా?

"అబ్బబ్బ..ఏం పిసినారిరా బాబూ ఈ చంద్రం గాడు. ఇలాంటి వ్యక్తిని నా ఇరవై ఏళ్ళ సర్వీసులో యింతవ రకు చూడలేదు. మనం యిలా రోజు టీలు సిగరెట్లు అవి ఒకళ్ళకొకళ్ళం తెప్పించుకొని ఏ ప్రమోషనొచ్చినా, ఏ చిన్న అకేషన్‌కయినా పార్టీలిచ్చుకొని ఎంజాయ్ చేస్తామా..మహా నుభావుడు ఏ రోజూ ఒక్క టీ చుక్కయినా ఒకళ్ళకిప్పించి నట్టూ లేదు. తాను తాగినట్టు లేదు. పైగా వేసుకొనే ఆ డ్రస్‌లు చూడు. డబ్బులు దాచి దాచి ఏ ఫైవ్‌స్టార్ హోటల్ కొంటాడో ఏమో" ఒక విలన్ నవ్వు నవ్వాడు రామ్మూర్తి. అతనితో శృతి కలిపేరు భజనపరులు.

"మీకెందుకండి అతని గురించి అంత ఆసక్తి. అత నెలా వుంటే మీకేం..మిమ్మల్నేమయినా యిప్పించమ న్నాడా" అప్పుడే ఆఫీసులో అడుగుపెట్టిన సూర్యనారాయ ణకి రామ్మూర్తి మాటలు కోపం తెప్పించాయి.

"అతన్నంటే నీకు పొడుచుకొచ్చిందేమిటోయ్ పౌరుషం" రామ్మూర్తి చుట్టూ చేరిన కాకారాయుళ్ళలో ఒకరి ఉవాచ.

"పోనీలేవోయ్ రాజూ..ఆ చంద్రం పొదుపుచేసి చేసి ఈ సూర్యానికేమైనా వడ్డీలకి అప్పులిస్తున్నాడో ఏమో అయినా అంత పొదుపరితో ఆ భార్యా, పిల్లలు ఎలా వేగుతున్నారో ఏమో. కడుపునిండా 'తిండయినా పెడుతున్నాడో లేదో. పాపం అయినా.." ఇంకేదో అనబోయి గుమ్మం వేపు చూసి ఠక్కున ఆగిపోయాడు రామ్మూర్తి. చేతిలో ఫైలు పట్టుకొని తలొంచుకొని తన సీటు వైపు వెళ్ళిపోయాడు చంద్రం.

అంతమంది రామ్మూర్తి చుట్టూ చేరి వున్నారంటే ఇంత వరకు ఏం చర్చించుకుంటున్నారో..తనను చూడగానే సడ న్‌గా రామ్మూర్తి మాట ఆగిపోయిందంటే ఆ టాపిక్ ఏమిటో తేలిగ్గానే వూహించుకోగలడు చంద్రం.

చంద్రం వూరుకొన్నా సూర్యానికి మాత్రం బాధగా వుంటుంది. వాళ్ళని కడిగేద్దామన్నంత కోపం వస్తుంది. కానీ 'కందకు లేని దురద కత్తిపీట కెందుకన్నట్లు' వుంటుంది కదా. చంద్రమే వాళ్ళకొకమారు తన విషయ మెందుకని గట్టిగా బుద్ధిచెప్పొచ్చుకదా. అయినా నిండా ముప్ఫయి ఏళ్ళయినా లేని చంద్రం ఏ సరదాలు లేకుండా ఎలా వుండగలుగుతున్నాడో తనకీ ఆశ్చర్యమే. ఒక సినిమా అనడు, ఒక షికారనడు. పోనీ జీతమేమయినా తక్కువొ స్తుందా అనుకొంటే పదిహేనువేల పైమాటే.

"సార్ మేనేజరుగారు మిమ్మల్ని రమ్మంటున్నారు" ఎటెండరు పిలుపుతో ఆలోచనలకి బ్రేక్‌పడింది సూర్యానికి.


సాయంకాలం ఐదవుతోంది. చంద్రం ఫైల్సన్నీ మూసి రేక్‌లో సర్ది తాళం వేసి బయలుదేరుతున్నాడు.

"ఆగండి చంద్రంగారూ. ఇంటికి బయలుదేరుతు న్నట్టు వున్నారు. నేను అటే వస్తున్నా కలిసే వెళదాం" సూర్యం మాటలకి వెళ్ళబోతున్న చంద్రం ఆగేడు. ఎవరి విషయంలోనూ కలగజేసుకోని సూర్యం అంటే గౌరవం చంద్రానికి.

ఇద్దరూ కలిసి బయలుదేరారు. "చంద్రంగారూ మిమ్మ ల్నొకటడుగుతాను ఏమీ అనుకోరుగా" అన్నాడు సూర్యం.

"అడగండి ఫరవాలేదు" నవ్వుతూ అన్నాడు చంద్రం.

"పదిహేను వేల దాకా జీతం తెచ్చుకొంటారు. మీరెం దుకంత.." మధ్యలోనే ఆగిపోయాడు సూర్యం తానడగడం సమంజసమో కాదో అనుకొంటూ.


కథా నిలయం
శ్రీకాకుళం

"మీ భావం నాకర్థమయింది. అందరూ నా వెనక అనుకొనే మాటల్నే మీరు డైరక్టుగా నన్నడుగుతున్నందుకు చాలా ఆనందంగా వుంది. ఎలాగూ యిటే వస్తున్నారుగా. మా యిల్లు యిక్కడికి దగ్గరే. రండి! మీ సంశయం నివృత్తి చేస్తా"

ooo

ఇల్లు చిన్నదైనా చాలా నీటుగా వుంది. ఎక్కడి వస్తువ లక్కడ తీర్చిదిద్దినట్టు వున్నాయి. చిన్నా పెద్ద జనాభా చాలా మందే కనిపిస్తున్నారు ఆ యింట్లో.

హాలుకి ప్రక్కనే వున్న చిన్న గదిలో మంచం మీద ఒక ఎనభై ఏళ్ళ ముసలాయన పడుకుని మూలుగుతున్నాడు. ఆ మంచం మీదే పక్కగా ఒక డెబ్బైయేళ్ళ ముసలావిడ కూర్చొని ముసలాయనకి విసురుతూ ఏదో లాలనగా అడు గుతోంది. వెళ్ళగానే లోపల సూర్యం కంటపడిన దృశ్యం అది.

"రండి సూర్యంగారూ. ఈయన మా నాన్నగారు. వయస్సు వచ్చినప్పటినుంచి ఐదేళ్ళక్రిందటి దాకా నా పిల్లలు నా సంసారం అంటూ బాధ్యతలు మోసి మోసి తన కంటూ ఏమీ మిగుల్చుకోకుండా పెద్ద చదువులు చదివించి నా కొడుకులిద్దరు పెద్ద ఆఫీసర్లంటూ మురిసిపోయిన నాన్నగారిని అతని ఖర్మానికతన్ని 'మిగిలిన బరువులు మీరే మొయ్యండి మాకేం సంబంధం లేదని' వదిలేసిన ఇద్దరన్న య్యలు వేరే వూళ్ళల్లో దర్జాగా భార్యాపిల్లలతో బ్రతుకుతు న్నారు. తీరని బాధ్యతలతో దిగుళ్ళతో వయస్సుడిగిపోయి నాలుగేళ్ళ బట్టి పక్షవాతంతో మంచం మీద పడి వున్నారు. పక్కనే కూర్చుని విసురుతున్నావిడ మా అమ్మగారు. ఆవి డకి డెబ్బై ఏళ్ళు. నాన్నగారి మంచి చెడ్డలన్నీ ఓపిక లేకపో యినా ఆవిడే చూసుకుంటూ వుంటుంది" కొడుకు మాటలు విని తలెత్తి చూసి "ఎవరు నాయినా" అంది మెల్లగా.

"మా ఆఫీసులో నాతోపాటు పనిచేసే ఆయన-సూర్యంగారు" అన్నాడు చంద్రం. అంతలోనే "అక్కా ఇలా రా ఒకమాట" అన్నాడు చంద్రం.

లోపలి నుంచి ముప్ఫయి రెండు అలా వుంటాయి ఒకావిడ వచ్చింది.

"ఈవిడ మా అక్క విశాల. పెళ్ళయి పదే ళ్ళయి ఇద్దరాడపిల్లల తల్లయిన తరువాత కట్నం చాలలేదని యింకా వేధించే భర్త పైశాచిక కృత్యాలు భరించలేక పిల్లలతో సహా పుట్టిల్లు చేరింది. ఈమెను చదివించక చేసిన తప్పుకి పరిహా రంగా చెల్లెలు వనజను కాలేజీలో చదివిస్తున్నా. తను బి.ఏ. చదువు తోంది. ఇప్పుడు చెప్పండి తండ్రి వైద్య ఖర్చులు, అక్క, ఇద్ద రాడపిల్లల భవిష్యత్తు, నా చెల్లెలు చదువు, వీరందరి వివా హాలు యివన్నీ నా ఒక్కడి వల్లే జరగాలంటే మామూలుగా సాధ్యమేనా చెప్పండి. ఇరుగిళ్ళకి పొరుగిళ్ళకి అప్పులకెళ్ళ కుండా తెచ్చిన జీతంతోటే కుటుంబసభ్యులందరూ తన వారే అనుకొని అందరి అవసరాలు గమనిస్తూ ఎవరికీ కష్టం కలగకుండా సంసారాన్ని గుట్టుగా నెట్టుకొస్తున్న నా యిల్లాలు రమదే ఈ క్రెడిట్ అంతా" అప్పుడే కాఫీలు తెస్తున్న రమని చూసి ఒక కప్పు అందుకొని సూర్యానికిస్తూ అన్నాడు చంద్రం.

"ఇప్పుడు చెప్పండి. నేను పిసినారిగా వుండటం తప్పా. ఇవన్నీ నేనందరితో చెప్పుకొని తిరగాలంటారా"

కళ్ళల్లో నీరు తిరుగుతూ వుండగా, చంద్రం విశిష్ట వ్యక్తి త్వాన్ని వీళ్ళెప్పుడు గుర్తిస్తారో అని రామ్మూర్తిలాంటి వాళ్ళని తలచుకుంటూ బయటకొచ్చాడు సూర్యం.

-వి.సత్యవతీదేవి (గుమ్మలక్ష్మీపురం)